నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
3 ఏప్రిల్ 2024
పేజీలు 8

**పుణెరి పల్టన్**

ప్రీమియర్ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10 విజేతగా పుణెరి పల్టన్ జట్టు నిలిచింది. మార్చి 1న హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 28-25తో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ఈ ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10 2023, డిసెంబర్ 2న ప్రారంభమయ్యింది. ఈ పీకేఎల్ 2014లో మొదలయ్యింది. తొలి ఎడిషన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ యు ముంబాపై గెలిచింది. ఈ పీకేఎల్‌ను ఎక్కువగా పట్నా పైరేట్స్ (మూడు సార్లు, హ్యాట్రిక్) గెలుచుకుంది.

# ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో క్విట్ ఇండియా ఉద్యమం

- బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందడం కోసం మహాత్మా గాంధీ 1942 ఆగస్టు 8న క్విట్ ఇండియా ఉద్యమం లేదా ఆగస్టు ఉద్యమాన్ని ప్రారంభించారు. బ్రిటిష్ వాళ్లు వెంటనే భారతదేశం విడిచిపెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రిటిష్ వాళ్లు భారతదేశం విడిచి వెళ్లడానికి 'డూ ఆర్ డై (చేయండి లేదా చావండి)' నినాదంతో ఒక భారీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించాలని ఆయన నిర్ణయించుకున్నారు. గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించడానికి క్రిప్స్ రాయబారం విఫలమవడం ప్రధాన పాత్ర పోషించింది. బ్రిటిష్ వారి రెండో ప్రపంచ యుద్ధ ప్రయత్నాలకు భారతీయ రాజకీయ పక్షాలతో చర్చలు జరపడానికి, వారి మద్దతు పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1942 మార్చి 22న సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపించింది.
- బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా అధినివేశ రాజ్యం (డొమినీయన్ స్టేటస్) ఏర్పాటు, రాజ్యాంగ సభ ఏర్పాటు, ప్రత్యేక రాజ్యాంగాలు రచించుకునేందుకు ప్రావిన్సులకు హక్కు లాంటి సిఫారసులతో క్రిప్స్ ఒక డ్రాఫ్టు ప్రతిని రూపొందించారు. వీటిని రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఆచరణలోకి తీసుకువస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఎప్పుడో హామీలు నెరవేరుస్తామని ఈ డిక్లరేషన్‌లో ఉందని కాంగ్రెస్ వాదించింది. క్రిప్స్ ప్రతిపాదనలు 'దివాలా తీస్తున్న బ్యాంకులో ముందటి తేదీ రాసి ఇచ్చిన చెక్‌లా ఉన్నాయి' అని గాంధీజీ వ్యాఖ్యానించారు. అలా క్రిప్స్ ప్రతిపాదనలను తిరస్కరించిన గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారు.

### ఆంధ్రలో..

- క్విట్ ఇండియా ఉద్యమం దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రావిన్సులకూ వ్యాపించింది. ఆంధ్రలో ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీ 'కర్నూలు సర్క్యులర్'గా ప్రసిద్ధి చెందిన ఒక సర్క్యులర్‌ను జారీచేసింది. కర్నూలు కాంగ్రెస్ కార్యాలయంలో పోలీసులు దీన్ని సీజ్ చేశారు. కాబట్టి కర్నూలు సర్క్యులర్‌గా ప్రసిద్ధి చెందింది. దీన్ని 1942 జూలై 29న కళా వెంకట్రావు రూపొందించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడైన డా. పట్టాభి సీతారామయ్య ద్వారా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదానికి పంపించారు.



- కర్నూలు సర్క్యులర్... బ్రిటిష్ ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించాలని, న్యాయవాదులు ప్రాక్టీసుకు స్వస్తి పలకాలని, విద్యార్థులు కళాశాలలను వదిలిపెట్టాలని, విదేశీ వ్యాపార, పారిశ్రామిక, ఉప్పు కొటారుల ముందు పికెటింగ్ చేయాలని, తాటిచెట్లను నరికేయాలని, టికెట్లు లేకుండా ప్రయాణించాలని, సైన్యం కదలికలను అడ్డుకోవాలని, టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగలను తెంపేయాలని, మున్సిపల్ పన్నులు మినహా ఇతర పన్నులను చెల్లించకూడదని, స్వాతంత్ర్య సూచకంగా ప్రభుత్వ భవనాల మీద జాతీయ పతాకాలను ఎగరవేయాలని నిర్దేశించింది. పరిపాలనకు సంబంధించిన అన్ని రకాల కమ్యూనికేషన్లు, యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసేయాలనేది కర్నూలు సర్క్యులర్ ఉద్దేశం. ఈ కాలంలో ఆంధ్రలో పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవ రెడ్డి, మాగంటి బాపినీడు మొదలైన నాయకులు నిర్బంధానికి గురయ్యారు.
- తెనాలి పట్టణంలో 1942 ఆగస్టు 12న కాంగ్రెస్ నాయకుల అరెస్టుకు నిరసనగా పూర్తి హర్తాళ్ నిర్వహించారు. ఒక గుంపు రైల్వే స్టేషన్‌కు నిప్పు పెట్టేందుకు ప్రయత్నించింది. రైల్వే స్టేషన్ ఇన్‌చార్జి పారిపోవడంతో వారు బుకింగ్ కార్యాలయంలోని పుస్తకాలు, రికార్డులు, నగదును ధ్వంసం చేశారు. దాంతో పోలీసులు కాల్పులకు దిగారు. ఇందులో భాస్కరుని లక్ష్మీనారాయణ, మాజేటి సుబ్బారావు, శ్రీపతి పండితారాధ్యుల శ్రీగిరి రావు మరణించారు.
- కాగా 1942 ఆగస్టు 12న 500 మంది విద్యార్థుల బృందం ఒకటి చీరాల సబ్ మేజిస్ట్రేట్ కోర్టు దగ్గరికి ఊరేగింపుగా వెళ్లింది. న్యాయస్థానాన్ని మూసివేయాలని న్యాయమూర్తిని కోరింది. ఆ భవనానికి నష్టం కలిగించిన తర్వాత ఆ బృందం సబ్ రిజిస్ట్రార్, సేల్స్ ట్యాక్స్ ఆఫీసర్ కార్యాలయాలపై దాడులకు పాల్పడింది. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌పైకి రాళ్లు విసిరారు. పోలీసులు, సైన్యం వచ్చిన తర్వాత మాత్రమే వాళ్లు చెదిరిపోయారు.
- ఆగస్టు 13న గుంటూరు హిందూ కళాశాల ముందు 2,000 మంది సత్యాగ్రహులు సమావేశమయ్యారు. వీరిలో విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. పోలీసులు కాల్పులకు తెగబడటంతో కొంతమంది గాయపడగా, ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. 1942 ఆగస్టు 12 రాత్రి ధవళేశ్వరం, రాజమండ్రి మధ్య బొమ్మకంటి వెంకట సుబ్రమణ్యం, చేకూరి వీర రాఘవస్వామి, చేకూరి వెంకటరాయుడు, జి.సత్తిరాజు, కె.రామకృష్ణారావు, టీవీ వెంకన్న, వీ సీతారామన్, రాజమండ్రికి చెందిన కేవీ సీతారామశాస్త్రి టెలిఫోన్ తీగలను కత్తిరించేందుకు ప్రయత్నించారు. అందరినీ పోలీసులు అరెస్టు చేశారు. తలా పద్దెనిమిది నెలల జైలు శిక్ష పడింది.
- 1942 ఆగస్టు 12న పాలకొల్లు, లంకలకోడేరు, భీమవరం, వేండ్రలో నిర్వాహకులు టెలిఫోన్ తీగలను కత్తిరించారు. ఆగస్టు 12, 13 తేదీల్లో నెల్లూరు పట్టణంలో వీధుల్లో ఊరేగింపులు తీశారు. వీధుల్లో విద్యుత్ బల్బులను పగలగొట్టారు. రైల్వే స్టేషన్‌లో టెలిఫోన్లు, సిగ్నల్ పరికరాలను ధ్వంసం చేశారు. కావలిలో స్థానిక బోర్డు హై స్కూలులో ప్రధానోపాధ్యాయుడి గదిని తగలబెట్టారు. నెల్లూరులోని వెంకటగిరి రాజా కళాశాలలో ప్రిన్సిపాల్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. గాంధీజీ ఇచ్చిన 'డూ ఆర్ డై' నినాదంతో ఆగస్టు నెలమొత్తం, సెప్టెంబర్ మొదటి పదిహేను రోజులు పోరాటం ఉధృతంగా సాగింది. అలా 1943 వరకు వారు పోరాటం కొనసాగించారు.


### తెలంగాణలో..

- క్విట్ ఇండియా ఉద్యమం హైదరాబాద్ రాష్ట్రంలో కూడా ప్రకంపనలు సృష్టించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బొంబాయి సమావేశంలో స్వామి రామానంద తీర్థ మహాత్మాగాంధీని కలిశారు. హైదరాబాద్‌లో క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించడానికి అనుమతి పొందారు. ఒక్క స్టేట్ కాంగ్రెస్ మాత్రమే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రజా మండళ్లు కూడా క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకొన్నాయి. స్వామి రామానంద తీర్థ బొంబాయి నుంచి సోలాపూర్ మార్గంలో హైదరాబాద్ బయల్దేరారు. తనను అరెస్టు చేసే అవకాశం ఉందని ముందే గ్రహించిన తీర్థ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ డిమాండ్లను వివరించే ఒక లేఖను డా. మేల్కోటేకు పంపించారు. దానిమీద సంతకం చేసి నిజాంకు పంపించాలని సూచించారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌లో దిగీదిగగానే రామానంద తీర్థను అరెస్టు చేశారు.
- డాక్టర్ జీఎస్ మేల్కోటే అందరు రాజకీయ ఖైదీల విడుదల కోసం స్టేట్ కాంగ్రెస్ తరఫున ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఇలా ఉంటే 'క్విట్ ఇండియా' నినాదాన్ని అలుసుగా తీసుకొని హైదరాబాదులోని కొన్ని విప్లవ (రియాక్షనరీ) శక్తులు బ్రిటిష్ వారు భారతదేశం నుంచి విరమించుకుంటున్నారంటే, హైదరాబాద్ కూడా స్వతంత్రం పొందినట్లే అని 'ఆజాద్ హైదరాబాద్' నినాదం ఇచ్చారు.
- హైదరాబాద్‌లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో పండిట్ నరేంద్రజీ, హరిశ్చంద్ర హెడా, జ్ఞానకుమారీ హెడా, విమలాబాయి మేల్కోటే, జీఎస్ మేల్కోటే, జితేంద్ర రాష్ట్రవాది, పద్మజా నాయుడు, రామస్వామి, బి. రామకృష్ణా రావు, జి. రామాచారి, గంగాధర్ కృష్ణ, గణపత్ రావు, కృష్ణ దూబే (సింగరేణి కాలరీస్ కొత్తగూడెం కార్మిక సంఘం నాయకులు), ఎల్. నారాయణ, రాజేశ్వర్ రావు, సోమయాజులు, డి. నర్సయ్య, కొమరగిరి నారాయణ రావు, ఎంఎస్ రాజలింగం, శ్రీధర్ రావు కులకర్ణి, కోదాటి నారాయణ రావు, వందేమాతరం రామచంద్ర రావు, ప్రేం రాజ్ యాదవ్, మల్లయ్య యాదవ్, కాళోజీ నారాయణ రావు అరెస్టయ్యారు.
- కేవలం సత్యాగ్రహులే కాకుండా ఉస్మానాబాద్, పర్భణి, ఔరంగాబాద్, నాందేడ్, ఉమ్రి నుంచి స్టేట్ కాంగ్రెస్‌తోపాటు మహారాష్ట్ర పరిషత్, కర్నాటక కాన్ఫరెన్స్ తరఫున కూడా హైదరాబాద్‌లో ఎంతోమంది స్వచ్ఛంద సేవకులు (వలంటీర్లు) సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. మహారాష్ట్ర పరిషత్ కార్యదర్శి గోవింద్ దాస్ ష్రాఫ్‌ను ఔరంగాబాదులో నిర్బంధంలో ఉంచారు. రెసిడెన్సీ భవనం మీద కాంగ్రెస్ పతాకం ఎగరేసినందుకు పద్మజా నాయుడును అరెస్టు చేశారు.
- అయితే హైదరాబాద్‌లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభానికి ముందే కాశీనాథ్ రావు వైద్య, హసన్ తిర్మీజీ, వినాయక్ రావ్ విద్యాలంకార్, రావి నారాయణ రెడ్డి, ఫతుల్లా ఖాన్, జనార్దన్ రావు దేశాయి, హనుమంత రావు లాంటి జాతీయవాద నాయకులు ఎన్నికైన మంత్రులతో కూడిన మంత్రిమండలి ఉండాలని నిజాంకు విజ్ఞప్తి చేశారు. పౌర హక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం కోసం రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండటంతో నిజాం ప్రభుత్వం బి.బి.సి. ఉద్యోగి అయిన ప్రొఫెసర్ రష్‌బ్రూక్ విలియమ్స్ సేవలు తీసుకుంది. వివిధ పత్రికలు, జర్నల్స్‌లో నిజాం ప్రభుత్వం తరఫున ప్రొపగాండా ప్రచారం కోసం ఆయనకు 200 పౌండ్ల వార్షిక గౌరవ వేతనం చెల్లించేది. పౌరుగున ఉన్న బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల లాగే, స్వదేశీ సంస్థానాల్లో, ప్రత్యేకించి హైదరాబాద్‌లో కూడా ప్రజలు ఒకే విధమైన రాజకీయ హక్కులు అనుభవిస్తున్నారని రష్‌బ్రూక్ విలియమ్స్ రాయాలి. ఇలా ఉంటే 1942 క్విట్ ఇండియా ఉద్యమ కాలంలోనే... అబిద్ హసన్ సఫ్రానీ, ప్రొఫెసర్ సతీశ్ చంద్ర అనే ఇద్దరు హైదరాబాదీలు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఏర్పాటు చేసిన భారత జాతీయ సైన్యం (ఐఎన్ఏ)లో చేరారు.

డా. వడ్డాణం శ్రీనివాస్
(ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) సౌజన్యంతో
హర్షవర్ధన్ చింతలపల్లి

### పూజివారా ఎఫెక్ట్

- 2023 ఆగస్ట్ చివర్లో అమెరికా ఆగ్నేయ తీరంలో రెండు హరికేన్లు ఏర్పడ్డాయి. హరికేన్ ఐడాలియా ఫ్లోరిడా తీరం వైపు, బెర్ముడా తీరం దిశగా ఫ్రాంక్లిన్ అనే హరికేన్ సంభవించాయి. ఈ రెండు హరికేన్లు కలిసి అమెరికా తూర్పుతీరంలో విధ్వంసం సృష్టిస్తాయనే భయాందోళనలు ఏర్పడ్డాయి. కానీ అలాంటి పరిస్థితి తలెత్తలేదు. అయితే ఏవైనా రెండు హరికేన్లు కలిసిపోయే పరిస్థితిని 'పూజివారా ఎఫెక్ట్' అని పిలుస్తారు. ఇలాంటి సందర్భంలో రెండు హరికేన్లు తమ ఉమ్మడి కేంద్రం చుట్టూ ఉధృతంగా తిరుగుతూ ఉంటాయి. దీన్ని రొటేషనల్ డ్యాన్స్ అంటారు. జపాన్ వాతావరణ శాస్త్రజ్ఞుడు సకుహేయి పూజివారా కనుక్కొన్నందు వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఆయన పరిశోధన 1921లో ప్రచురితమైంది. రెండు టైఫూన్ కేంద్రాల మధ్య దూరం 1400 కిలోమీటర్ల కంటే తక్కువగా ఉన్నప్పుడు పూజివారా ఎఫెక్ట్ చోటు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దీన్ని 1964లో మొదటిసారిగా పశ్చిమ పసిఫిక్ సముద్రంలో గుర్తించారు. అప్పుడు మేరీ, కాథీ అనే రెండు టైఫూన్లు (పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే తుఫాన్లు) కలిసిపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఇలా రెండు టైఫూన్లు గానీ, తుఫాన్లు లేదా హరికేన్లు కావచ్చు.. అవి వేర్వేరు ప్రదేశాల్లో ఏర్పడి ఒకేవైపు కదులుతూ ఒకదానికొకటి దగ్గర దగ్గరగా వస్తాయి. అప్పుడు వాటి ఉమ్మడి టైఫూన్ కేంద్రం చుట్టూ అవి ఉధృతంగా నాట్యం చేయడం మొదలుపెడతాయి.



- రెండు టైఫూన్లు కలిసిపోవడానికి సంబంధించి ప్రకృతిలో ఐదు రకాల పరిస్థితులు ఏర్పడతాయి. ఒక టైఫూన్ (తుఫాన్) తీవ్రత మరో దానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు.. తక్కువ తీవ్రత ఉన్నది ఎక్కువ తీవ్రత ఉన్నదాని చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది. చివరికి తక్కువ తీవ్రత ఉన్నది ఎక్కువ తీవ్రత ఉన్న టైఫూన్‌లో కలిసిపోతుంది. రెండు టైఫూన్ల తీవ్రత సమానంగా ఉంటే అవి వాటి మార్గాన అవి వెళ్లిపోతాయి. లేదంటే ఒక ఉమ్మడి కేంద్రాన్ని ఏర్పర్చుకుని, ఒకదానితో ఒకటి కలిసిపోయే వరకు ఒకదానిని ఒకటి ఆకర్షించుకుంటాయి. లేదంటే ఆ టైఫూన్లు తమ మానాన తాము వెళ్లిపోయేవరకు ఒక దాని చుట్టూ ఒకటి తిరుగుతూ ఉంటాయి. అరుదైన సందర్భాల్లో మాత్రం నాట్యం చేసే రెండు టైఫూన్లు (పూజివారా ఎఫెక్ట్) ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. అలా భారీ టైఫూన్‌గా ఏర్పడి తీర ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తాయి. 2009 అక్టోబర్‌లో ఫిలిప్పీన్స్‌కు దగ్గర్లో ఏర్పడిన టైఫూన్ పర్మా, టైఫూన్ మెలోర్ ఒకదానికొకటి కలిసిపోయి.. తర్వాత వేటి దిశలో అవి వెళ్లిపోయిన సందర్భం ఏర్పడింది.

**నోట్:** అవగాహన కోసం వివరాలు అందించాం. సాంకేతిక అంశాలను సరి చూసుకోగలరు.